
నిధుల కోసం ఎదురుచూపులు





- హరిత పార్కులో వర్షం కురిస్తే నిలిచిపోతున్న నీరు
- పిల్లలకు ఆట పరికరాలు లేక ఇబ్బందులు
- ప్రభుత్వం సహకరిస్తే ఆదర్శంగా తీర్చిదిద్దుతామంటున్న నిర్వాహకులు



మురళీనగర్ : మురళీనగర్‌లోని హరిత పార్కు గత ప్రభుత్వం హయాంలో సుందరంగా తీర్చిదిద్దారు. గతంలో గాలికి వదిలేసిన ఈ పార్కును వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పరిపాలనలో జీవీఎంసీ ఇతోధికంగా నిధులు అందించి సదుపాయాలు కల్పించింది. దీంతో ఈ పార్కుకు సందర్శకుల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం ఉన్న సౌకర్యాలకు అదనంగా మరిన్ని వసతులు కల్పిస్తే తమ పార్కుకు ప్రాధాన్యత పెరుగుతుందని, ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పార్కు నిర్వాహకులు కోరుతున్నారు. ఇందుకు జీవీఎంసీ అధికారులు సహకరించాల్సి ఉంది. అవసరమైన మేరకు నిధులు మంజూరు చేస్తే పార్కు కొత్త రూపు సంతరించుకుంటుంది.

దశాబ్దాల నాటి కల నెరవేరిందిలా..

మురళీనగర్ సెక్టార్ – 8లోని కొండ దిగువన 25 ఏళ్ల క్రితం హరిత పార్కును దాతల సాయంతో నిర్మించారు. మురళీగాన లోలుడు శ్రీకృష్ణుడి విగ్రహం, షటిల్ కోర్టు, వాచ్‌మన్ గది, పార్కు నిర్వహణ కార్యాలయం, వేదికల నిర్మాణానికి దాతలు సాయం చేయడంతో పార్కు ఒక రూపానికి వచ్చింది. అయితే దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న వాకింగ్ ట్రాకు నిర్మాణం కల గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలోనే నెరవేరింది. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ప్రత్యేక కృషితో రూ.19 లక్షల జీవీఎంసీ నిధులతో అభివృద్ధి చేశారు. వీరి చిరకాల వాంఛ మట్టితో అధునాతనంగా రూపొందించిన వాకింగు ట్రాకు అందుబాటులోకి వచ్చింది. రూ.8 లక్షలతో ఓపెన్ జిమ్ పరికరాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. గర్ఫ్ వాల్స్ నిర్మించడంతో అందంగా తయారయ్యింది.

ఇంకా ఏమేం కావాలంటే...

లోపలికి ప్రవేశించగానే ఎంతో ఆహ్లాదకరంగా, అందంగా కనిపించే పార్కులో కొన్ని అత్యవసర పనులు చేపట్టాల్సి ఉంది. ముఖ్యంగా పార్కు ప్రవేశ ద్వారం అధునాతనంగా నిర్మించాల్సి ఉంది. గేటు పూర్తిగా పాడయ్యింది. పిల్లలకు కేటాయించిన ప్రాంతంలో ఆట పరికరాలు లేవు. వర్షాలు కురిస్తే పార్కు వరద ముంపునకు గురవుతోంది. ఈ వేసవిలోనే తక్షణం భూగర్భ డ్రైనేజీ నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలి. ప్రహరీ గోడ మరమ్మతులతోపాటు రంగులు వేయించాలి. స్టేజీ ముందు ప్రాంగణం టైల్స్‌తో నిర్మించాలని వాకర్స్ క్లబ్ నిర్వాహకులు కోరుతున్నారు.

మరింత సుందరంగా తీర్చిదిద్దుతాం



మా పార్కు అభివృద్ధికి అదనపు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును ఇటీవల కలిసి వినతిపత్రం అందించాం. దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామన్నారు. జీవీఎంసీ అధికారులు సహకరిస్తే పార్కును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు మా కమిటీ సభ్యులు సిద్ధంగా ఉన్నారు. పార్కులో మరింత ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తే సందర్శకుల ఆదరణ పెరుగుతుంది.
– పిల్లా కొండలరావు, అధ్యక్షుడు, హరిత పార్కు నిర్వహణ కమిటీ

పిల్లల పార్కు అభివృద్ధి చేయాలి



మా పార్కుకు పిల్లలు ఎక్కువగా వస్తున్నారు. అయితే వారు ఆడుకోవడానికి కనీస ఆట పరికరాలు లేవు. ఇవి కొనాలంటే ఖరీదుతో కూడిన పని. స్టేజీ ముందు విశాలమైన స్థలాన్ని టైల్స్‌తో నిర్మిస్తే సమావేశాలు నిర్వహించుకోవడానికి పూర్తి సౌకర్యవంతంగా ఉంటుంది. భూగర్భ డ్రైనేజీని ఈ వేసవిలో నిర్మించే విధంగా జీవీఎంసీ నిధులు మంజూరు చేయాలి. పార్కును మరింత సుందరంగా అభివృద్ధి చేసి సౌకర్యాలు కల్పించాలి.
– డి.దేముడు, ప్రధాన కార్యదర్శి, హరిత పార్కు నిర్వహణ కమిటీ

రైతుబజారులో ఆకస్మిక తనిఖీ



నరసింహనగర్ రైతుబజార్‌లో తనిఖీ చేస్తున్న మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కిరణ్

సీతంపేట : మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కిరణ్ నరసింహనగర్ రైతుబజార్‌ను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బజార్‌లోని స్టాల్స్‌లో కూరగాయల విక్రయాలు, నాణ్యత, రైతుల గుర్తింపు కార్డులు పరిశీలించారు. డ్వాక్రా స్టాల్స్ పరిశీలించారు. వినియోగదారులతో రైతులు మెలుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన, తాజా కూరగాయలు వినియోగదారులకు అందించాలని ఆదేశించారు. అలాగే పాలిథిన్ సంచులు వాడరాదని సూచించారు. రైతులు ఎక్కువ మొత్తంలో పండించిన కూరగాయలు రైతు బజార్‌లో అమ్ముడుకాకపోతే తమ దృష్టికి తీసుకొస్తే... వేరే రైతు బజార్‌లో విక్రయించేలా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో బజారు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీలలితాపీఠంలో సంకటహర చతుర్థి



శ్రీలలితాపీఠంలో గణపతికి హారతిస్తున్న దత్తేశ్వరానంద భారతిస్వామి

సీతంపేట : సంకటహర చతుర్థి సందర్భంగా స్థానిక లలితాపీఠంలో ఆదివారం సాయంత్రం వినాయకునికి పంచామృత అభిషేకం, అర్చన, అలంకరణ, ప్రత్యేక పూజలు, లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతి స్వామి గణపతికి పూజ చేసి హారతిచ్చారు. పీఠం అర్చకుల మంత్రోచ్చారణ మధ్య దూప దీప నైవేద్యం, గణేష్ స్తోత్రం, వ్రత కథ చదివారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో శాస్త్రోక్తకంగా లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. గణపతి హోమం వల్ల కార్యసిద్ధి, ఆరోగ్యం, విజయం లభిస్తాయని అర్చకులు తెలిపారు. బహుళ పంచమి సందర్భంగా సోమవారం సాయంత్రం వారాహి హోమం, బహుళ అష్టమి సందర్భంగా గురువారం ఉదయం 9:30 గంటలకు చండీ హోమం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

క్లుప్తంగా

మాధవుని సన్నిధిలో మాఘమాస పూజలు



జలధార వద్ద పుణ్య స్నానమాచరిస్తున్న భక్తులు

మద్రిపాలెం : ప్రాచీన ఆలయంగా ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీ లీలా మాధవస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మాఘ మాసం మూడో ఆదివారం కావడం, తీర్థ మహోత్సవం (పరస) నిర్వహించడంతో పెద్ద ఎత్తున భక్తులు వేకువజామునే ఆలయానికి చేరుకుని ముందుగా జల'ధార' వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం లీలామాధవస్వామిని, వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ మహోత్సవం (పరస)లో పాల్గొన్న భక్తులు అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవస్థానం సిబ్బంది ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గౌరీ సేవా సంఘం అధ్యక్షుడిగా అప్పలరాజు



ఎన్నికల అధికారి నుంచి నియామకపత్రం అందుకుంటున్న రాజగిరి అప్పలరాజు

సీతంపేట : శ్రీగౌరీ సేవా సంఘం అక్కయ్యపాలెం శాఖకు నూతన అధ్యక్షునిగా అక్కయ్యపాలెం రామచంద్రానగర్‌కు చెందిన రాజగిరి అప్పలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2025 – 27 వరకు రెండు సంవత్సరాలపాటు సంఘం అధ్యక్షునిగా కొనసాగనున్నారు. ఆదివారం జగన్నాథపురంలో ఆలయాల సముదాయం వద్ద జరిగిన ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి 9 మంది నామినేషన్ వేయగా, ఎనిమిది మంది ఉపసంహరించుకోవడంతో అప్పలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు కర్రి అచ్యుతరావు, పెంటకోట సంజీవరావు నాయుడు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ సంఘం అభివృద్ధి, గవర కులస్తుల సంక్షేమానికి పాటుపడతానని తెలిపారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి ప్రత్యేక హారతి ఇస్తున్న పూజారి విజయమ్మ

కంచరపాలెం: కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, ఆలయ ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది : హరే కృష్ణ, హరే రామ నామస్మరణ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజలు సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. ఈ నేపథ్యంలో రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు.

గ్రంథాలయాల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

సీతంపేట : గ్రంథాలయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. అరసం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. పుస్తక పఠనంతో విద్యార్థులు, పాఠకులు మంచి పౌరులుగా తయారయ్యేలా గ్రంథాలయాలు దోహదపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల గ్రంథాలయాల నిర్వహణ, ఉనికి సమస్యల్లో పడిందన్నారు. వందేళ్ల కిందట నడిచిన ఉద్యమం వల్ల ఎన్నో గ్రంథాలయాలు ఏర్పడి ప్రజలకు జ్ఞాన సంపద అందించాయని గుర్తు చేశారు. అటువంటి గ్రంథాలయాలపట్ల అశ్రద్ధ వహించడం అన్యాయమన్నారు. మాజీ ఎమ్మెల్సీ శర్మ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత ఇప్పటికీ రాష్ట్ర గ్రంథాలయం ఏర్పాటు కాలేదన్నారు. రాష్ట్రంలో కేవలం మూడు ప్రాంతీయ గ్రంథాలయాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధి కోసం అప్పట్లో శాసన మండలి ఫ్లోర్ లీడర్‌గా మూడుసార్లు ప్రశ్నించినట్టు తెలిపారు. దొంగ చేతికి తాళాలు అప్పగించినట్టు ఎవరైతే 100 కోట్ల గ్రంథాలయ స్థలాన్ని కాజేసేందుకు ప్రయత్నించారో ఆయనే విద్యాశాఖా మంత్రిగా ఉన్నారని గుర్తు చేశారు. దీనిపై శాసన మండలిలో ప్రశ్న లేవనెత్తగా మూడు నెలల్లో గ్రంథాలయం నిర్మిస్తామని సభకు హామీ ఇచ్చారని, తొమ్మిదేళ్లు గడిచినా అతీగతీ లేదన్నారు. పౌరుల చొరవతో విశాఖ పౌరగ్రంథాలయం అద్భుతంగా నిర్వహిస్తున్నారని, అటువంటిది ప్రభుత్వం తలచుకుంటే ఇంకెంత బాగా నిర్వహించవచ్చో ఆలోచించాలన్నారు. అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ రానున్న ఏప్రిల్‌లో విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి సమావేశంలో గ్రంథాలయాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు. దీని కోసం జిల్లాల్లోని రచయితలు, కవులు, మేధావులు, పాఠకులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక విశాఖ జిల్లా కన్వీనర్‌గా బసు పోతన, కో కన్వీనర్‌గా ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథలయాల పూర్వవైభవం కోసం తమవంతు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ, పౌరగ్రంథాలయం సంయుక్త కార్యదర్శి డి.వి.సూర్యారావు, రచయిత అడపా రామకృష్ణ, శరత్‌చంద్ర జ్యోతి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో జీవించాలి



పూజల్లో పాల్గొన్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, తదితరులు

తాటిచెట్లపాలెం : తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కన గల శ్రీ లక్ష్మి వినాయక ఆలయంలో శ్రీ గురుపాద సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సంకటహర చతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు బాలానంద శివాచార్య స్వామి శైవ ఆగమ సంప్రదాయంలో మంగళధ్వని వేదమంత్రాలతో హోమం, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజలో ముఖ్య అతిథిగా నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో జీవించాలని ఆయన సూచించారు. ఆలయ కమిటీ సభ్యులు సీపీని ఘనంగా సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంపీ రాజశేఖర్, శ్రీ గురుపాద సేవా సమితి సభ్యులు ఎంపీ రమణమూర్తి, పి.వేణుగోపాల్, డీఎస్ వర్మ, రమణమూర్తి, మహిళా సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

రౌడీయిజం చేస్తే కఠిన చర్యలు



రౌడీషీటర్లుకు కౌన్సెలింగ్ చేస్తున్న ఫోర్తుటౌన్ ఇన్‌చార్జి సీఐ దాలిబాబు

సీతమ్మధార : రౌడీయిజం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఫోర్తుటౌన్ ఇన్‌చార్జి సీఐ దాలిబాబు సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి వేలి ముద్రలతో పాటు సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు.

గొడవలకు పాల్పడినా, ఎవరినైనా బెదిరించినా చర్యలు తప్పని హెచ్చరించారు. అల్లర్లు చేయకుండా... తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. ఎస్ఐ జి.వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహా కుంభమేళా యాత్రికులకు ఏర్పాట్లు



ప్రయాణికులకు సమాచారం తెలియజేస్తున్న సిబ్బంది

తాటిచెట్లపాలెం : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు వెళ్లే ప్రయాణికుల కోసం ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ విస్తృత ఏర్పాట్లు చేసినట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. వాల్తేర్ డివిజినల్ రైల్వే మేనేజర్ మనోజ్ కుమార్ సాహూ నేతృత్వంలో ప్రయాణికుల కోసం పలు రైళ్లు నడుపుతున్నామన్నారు. కమర్షియల్ సిబ్బది, రైల్వే భద్రతా దళం సిబ్బంది ప్రయాణికులకు ఎప్పటికప్పుడు సూచనలిస్తూ, ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రత్యేక రైళ్లు, మహా కుంభమేళా ఏర్పాట్లు తెలియజేసే కరపత్రికలను ప్రయాణికులకు అందించారు.

హోమియో మందుల పంపిణీ



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ పర్యవేక్షణలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టీజే మోహన్ పాల్గొని 80 మంది రోగులను పరీక్షించి అవసరమైన మందులు ఉచితంగా అందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు, కె.చంద్రశేఖరరావు, కె.శ్రీనివాసరావు, సభ్యులు ఎం.శంకర్, వి.రాంబాబు, వి.శ్రీనివాసరావు, రాము, లక్ష్మణ్, దివ్య, సాయి పాల్గొన్నారు.

శివరాత్రి విశిష్టతపై ప్రబోధ సేవా సమితి ప్రచారం



రామునాయుడుపేటలో ప్రచారంలో ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు

తగరపువలస : త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక విజయరాంపురం కమిటీ సభ్యులు శివరాత్రి విశిష్టతపై ఆదివారం భీమిలి మండలం రామునాయుడుపేట, ముద్దాడపేట, బోడమెట్టపాలెంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల విశిష్టతను వివరించారు. కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు మాట్లాడుతూ శివలింగంపై ఉన్న మూడు విభూతిరేఖలు ఆత్మ, జీవాత్మ, పరమాత్మలకు గుర్తు అన్నారు. ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడన్నారు. శివరాత్రి జాగరణ అంటే మాయ పట్ల జాగృతి కలిగి జ్ఞానం పొందడమన్నారు. ఇతరులకు జ్ఞానం తెలియచేయాలన్నారు. అందుకే శివరాత్రిని మోక్షరాత్రి అంటారన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు బంగారుతల్లి, నరసయ్యమ్మ, వి.సురేష్, కె.రాజు, సత్యం, కె.సంతోష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'తెలుగు సాహిత్యానికి జీవితాన్ని అర్పించారు'



శారద కథలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పెనుగొండ లక్ష్మీ నారాయణ, తదితరులు

సీతంపేట : తమిళనాట పుట్టి, తెలుగు సాహిత్యానికి జీవితాన్ని అర్పించిన మహోన్నత వ్యక్తి సాహిత్య చిరంజీవి శారద సుబ్రహ్మణ్య అయ్యర్ నటరాజన్ అని పలువురు వక్తలు కొనియాడారు. విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ ఘండికోట రఘురామారావు అధ్యక్షతన ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం సుబ్రహ్మణ్య నటరాజన్ అయ్యర్ శత జయంతి సభ ఘనంగా నిర్వహించారు. సభకు ముఖ్య అతిధిగా హాజరైన అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ తమిళనాడులోని పుదుక్కోటిలో జన్మించిన శారద సుబ్రహ్మణ్య నటరాజన్ 12 ఏళ్ల వయస్సులో వృద్ధుడైన తన తండ్రితో బతుకుతెరువు కోసం1937లో ఆంధ్రాలోని తెనాలికి వచ్చారని తెలిపారు. తెలుగు భాషపై పట్టు సాధించి వందకుపైగా కథలు రాశారని తెలిపారు. 31 సంవత్సరాల వయస్సులోనే శారద చనిపోవడం దురదృష్టకరమని, విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో శారద శత జయంతి సభ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం కె.శరత్ చంద్ర సంపాదకత్వంలో ప్రచురించిన శారద కథలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, శరత్‌చంద్ర, జె.పి.శర్మ పాల్గొన్నారు.

జాతీయ రహదారి పక్కనే వాహనాల పార్కింగ్



జాతీయ రహదారి పక్కనే పార్కింగ్ చేసిన వాహనాలు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు పరిధిలో గల జాతీయ రహదారిని ఆనుకుని వాహనాలు పార్కింగ్ చేయడం గమనార్హం. ఇక్కడి గురుద్వారా జాతీయ రహదారి జంక్షన్ నుంచి సత్యం జంక్షన్ సిగ్నల్స్‌కి వెళ్లే రోడ్డుకి ఎడమవైపున రోడ్డు పొడవునా వాహనాలు పార్కింగ్ చేసి వదిలేస్తున్నారు. ఈ మార్గం నిత్యం బస్సులు, ఇతర వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో 69, 540, 541, 222వీ, 211, శ్రీకాకుళం, విజయనగరం వెళ్లే బస్సులు రాకపోకలు సాగిస్తాయి. రోడ్డుని ఆనుకుని ఉన్న ప్రాంతంలో పదుల సంఖ్యలో కార్ గ్యారేజీలు ఉన్నాయి. ప్రైవేట్ ట్రావెల్ సంస్థల కార్యాలయాలు కూడా రోడ్డు పక్కనే ఉండడంతో రోడ్డు పొడవునా ట్రావెల్ బస్సులు కూడా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఒకవైపు కార్లు, మరోవైపు ట్రావెల్ బస్సుల పార్కింగ్‌తో ఈ ప్రాంతమంతా పార్కింగ్ అడ్డాగా మారిపోతోందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఈ రోడ్డులో గురుద్వారా జంక్షన్ నుంచి సత్యం జంక్షన్ వైపు వాహనాలు వెళ్లే క్రమంలో ఇక్కడ ర్కింగ్ చేసిన కార్లు, ట్రావెల్ బస్సులు అకస్మాత్తుగా హైవే రోడ్డు మీదకు కుడివైపు తిరిగే సందర్భాల్లో వాహన చోదకులు హడలిపోతున్నారు. పాదచారులు కూడా తీవ్ర ఇక్కట్లు పడాల్సిన దుస్థితి నెలకొంది. రోడ్డుపక్కనే అధిక సంఖ్యలో కార్లు, బస్సుల పార్కింగ్ కారణంగా ఇక్కడి గాంధీనగర్ దిగువ రోడ్డులోకి వెళ్లే వాహనాలు మలుపు తిరగడం కూడా కష్టతరంగా వుంటుందని అంటున్నారు. ఇప్పటికైనా ద్వారకా పట్టణ పోలీసులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.